సాక్షి అనంతపురం

శనివారం, 30, ఆగస్టు, 2025



చీనీ టన్ను రూ.17 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.17 వేలు పలికాయి.



టమాట కిలో రూ.23

అనంతపురం కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.23 పలికింది. కనిష్టం రూ.14, సరాసరి రూ.19 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం 34.6°/21.8°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

తిరుపతి-కాచిగూడ మధ్య స్పెషల్ రైలు



గుంతకల్లు: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఈ నెల 30న తిరుపతి-కాచిగూడ మధ్య స్పెషల్ రైలు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైలు శనివారం రాత్రి 9.10 గంటలకు తిరుపతి జంక్షన్ (02793)లో బయలుదేరి ఆదివారం ఉదయం 11 గంటలకు కాచిగూడ రైల్వేస్టేషన్ చేరుతుందన్నారు. ప్రస్తుతం కాచిగూడ నుంచి తిరుపతికి (02792) ప్రత్యేక రైలు శుక్రవారం రాత్రి 11 గంటలకు బయలుదేరిందన్నారు. రైలు రేణిగుంట, రాజంపేట, కడప, తాడిపత్రి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం, రాయచూరు, కృష్ణా, యాదగిరి, సేలం, తాండూరు, వికారాబాద్, లింగంపల్లి, సికింద్రాబాద్ మీదుగా ప్రయాణిస్తుందన్నారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు నూతన బార్లకు లాటరీ

అనంతపురం: నూతన బార్ల ఏర్పాటుకు శనివారం లాటరీ ప్రక్రియ నిర్వహించనున్నారు. జిల్లాలో కొత్తగా 19 బార్ల ఏర్పాటుకు దరఖాస్తులు స్వీకరించారు. ఇందులో 10 బార్లకు 40 దరఖాస్తులు రాగా.. 9 బార్లకు దరఖాస్తులు రాలేదు. గీత కులాలకు సంబంధించి రెండు బార్లకు నోటిఫికేషన్ రాగా, మొత్తం 10 దరఖాస్తులు వచ్చాయి. ఓపెన్ కేటగిరిలో 10, గీత కులాలకు సంబంధించి రెండు బార్లకు శనివారం లాటరీ ప్రక్రియ నిర్వహించనున్నారు. జెడ్పీలో శనివారం ఉదయం 8 గంటలకు ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. కలెక్టర్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో లాటరీ చేపడుతున్నట్లు వెల్లడించారు.

పీఆర్ ఎస్ఈగా చిన్న సుబ్బరాయుడు

అనంతపురం సిటీ: జిల్లా పంచాయతీరాజ్ సర్కిల్ కార్యాలయ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ)గా వై.చిన్న సుబ్బరాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పల్నాడు జిల్లాలో పని చేస్తున్న చిన్న సుబ్బరాయుడుకు పదోన్నతి కల్పించి అనంతపురం సర్కిల్ కార్యాలయ ఎస్ఈగా నియమించారు.

దళితులను చితకబాదిన పోలీసులు

- వినాయక నిమజ్జనం సందర్భంగా చెన్నంపల్లిలో ఓవరాక్షన్



దళితులను కొడుతున్న పోలీసులు



హరీష్ చేతికి గాయం

బుక్కరాయసముద్రం: వినాయక నిమజ్జనం సందర్భంగా పోలీసులు రెచ్చిపోయారు. దళితులను చితకబాదారు. ఈ ఘటన బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. చెన్నంపల్లి ఎస్సీ కాలనీలో గణేశ్ విగ్రహం ఏర్పాటు చేశారు. మూడు రోజులు కావడంతో శుక్రవారం నిమజ్జనం చేయాలని పోలీసులు సూచించారు. ఆ మేరకు ఏర్పాట్లు చేస్తుండగా 'రేయ్.. తొందరగా తీయండి' అంటూ కాలనీ యువకులపై పోలీసులు ఆగ్రహించారు. అంతటితో ఆగకుండా ఓ వ్యక్తిని కానిస్టేబుల్ కొట్టబోయాడు. ఈ దృశ్యాన్ని స్థానికుడైన హరీష్ అనే యూట్యూబ్ చానల్ నిర్వాహకుడు వీడియో తీస్తుండగా.. అతన్ని కానిస్టేబుల్ అకారణంగా కొట్టాడు. తాను విలేకరినని, ఏం తప్పు చేశానని కొట్టారంటూ కానిస్టేబుల్‌ను హరీష్ ప్రశ్నించాడు. ఈ సందర్భంగా కానిస్టేబుల్, హరీష్ ఇరువురూ తోపులాడుకుంటుండగా.. మరికొందరు పోలీసులు వచ్చి హరీష్‌ను చితకబాదారు. అతని చేతికి గాయమైంది. అడ్డొచ్చిన దళిత మహిళలను సైతం లాఠీలతో కొట్టారు. హరీష్‌తో పాటు మరికొంత మందిని స్టేషన్‌కు తరలించారు. కాగా, ఈ ఘటనపై సీఐ పుల్లయ్య వివరణ ఇస్తూ.. తామెవరినీ కొట్టలేదని, వారే తమ విధులకు ఆటంకం కలిగించారని చెప్పారు. పీఎస్ఐ కళ్యాణ్ చొక్కా పట్టుకుని దురుసుగా ప్రవర్తించిన హరీష్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

తమ్ముళ్ల బరి తెగింపు



ఉమ్మడి జిల్లాలో నిత్యం ఎక్కడో ఒకచోట హల్‌చల్

- 'అనంత'లో రెండు వర్గాల నడుమ తరచూ ఘర్షణలు
- ఇటీవల పెనుకొండలో రెచ్చిపోయిన మంత్రి సవిత వర్గీయులు
- రెండు రోజుల క్రితం కదిరిలో వైద్య సిబ్బందిని చితకబాదిన 'తమ్ముళ్లు'
- తాజాగా 'శింగనమల'లో ఎమ్మెల్యే, ఎంపీలకు వ్యతిరేకంగా ధర్నా
- నిస్సహాయంగా పోలీసులు.. భయకంపితులవుతున్న ప్రజలు



కదిరిలో టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన వారితో కలిసి ధర్నా చేస్తున్న వైద్యులు, సిబ్బంది (ఫైల్)

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రోడ్డెక్కుతున్నారు.. నానా యాగీ చేస్తున్నారు.. అధికార మదంతో దాడులకూ దిగుతున్నారు.. 'కూటమి' అధికార పగ్గాలు చేపట్టిన నాటి నుంచి 'తమ్ముళ్ల' రచ్చ చేస్తుండడం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. అంతర్గత గొడవలు, వర్గపోరుతో స్వపక్షంలోనే విపక్షం అన్నట్టు నిత్యం టీడీపీలో అసమ్మతులు భగ్గుమంటున్నాయి. రోజుకో నియోజకవర్గంలో రచ్చ చేస్తున్నాయి. 'తెలుగు తమ్ముళ్ల' గొడవలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పోలీసులు నిశ్చేష్టుల్లా చూస్తూ ఉండిపోతున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటున్న పరిస్థితి. కింది స్థాయిలో చిన్న ఉద్యోగాలను సైతం ఎమ్మెల్యేలు అమ్ముకుంటుండటంతో పార్టీకి పనిచేసిన వారు రోడ్డెక్కుతున్నారు.

కియా వద్ద మంత్రి అనుచరుల హల్‌చల్..

రెండు వారాల క్రితం పెనుకొండలో కియా కార్ల ఉత్పత్తి పరిశ్రమ వద్ద మంత్రి సవిత వర్గీయులు చేసిన దౌర్జన్యం అంతా ఇంతా కాదు. కాంట్రాక్టులన్నీ తమకే కావాలని చేసిన రచ్చ రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. విడిభాగాల పరిశ్రమల నుంచి వచ్చే లారీలను బయటే ఆపేశారు. కియా పరిశ్రమ లోపలకి చొచ్చుకు వెళ్లడానికి యత్నించారు. వందల మంది ఒక్కసారిగా రావడంతో పరిశ్రమ యాజమాన్యం ఆందోళన చెందింది. మళ్లీ నాలుగు రోజుల క్రితం టీడీపీ నాయకులు కొందరు గేటు బయట రచ్చ చేసినట్టు పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

అర్బన్‌లో ఆధిపత్య పోరు..

అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో వర్గ పోరు పతాక స్థాయికి చేరింది. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి మధ్య రోజుకో వివాదంతో గందరగోళం నెలకొంది. ఇద్దరి మధ్యా ఆధిపత్య పోరుతో ప్రశాంతంగా ఉండే అనంతపురం నగరంలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

మద్యం మత్తులో వైద్య సిబ్బందిపై దాడి..

కదిరిలో రెండు రోజుల క్రితం మద్యం మత్తులో టీడీపీ కార్యకర్తలు నానా రభస చేశారు. స్థానిక ఆస్పత్రిలో వైద్యురాలు రిషిత, నర్సు బాల మునెమ్మతో పాటు సెక్యూరిటీపై దాడి చేశారు. దీనిపై బాధితులు నేరుగా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఇక.. ఇటీవల ఉరవకొండ నియోజకవర్గంలోని ఆమిద్యాల గ్రామంలో ఆధిపత్య పోరుతో టీడీపీకి చెందిన రెండు వర్గాలు ఘర్షణ పడి ఒకరిని ఒకరు తన్నుకోవడం సంచలనం సృష్టించింది.

ఎమ్మెల్యే, ఎంపీపై తిరుగు'బావుటా'

శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, ఎంపీ అంబికా లక్ష్మినారాయణపై టీడీపీ కార్యకర్తలు తిరుగుబావుటా ఎగురవేయడం గమనార్హం. ఈ క్రమంలోనే శుక్రవారం పచ్చ పార్టీ నాయకులు బుక్కరాయసముద్రం ఎంపీడీఓ ఆఫీసు వద్ద ధర్నా చేయడం చూసి జనం నవ్వుకున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులను ఎమ్మెల్యే, ఎంపీ అమ్ముకుంటున్నారని, పార్టీ కోసం కష్టపడిన వారికి ఇవ్వడం లేదంటూ ఈ సందర్భంగా 'తమ్ముళ్లు' ఆరోపించడం చర్చనీయాంశమైంది. 'ఈ ఎమ్మెల్యే, ఎంపీ మాకొద్దు' అంటూ నినాదాలు చేశారు. అధికార పార్టీకి చెందిన కార్యకర్తలు తమ పార్టీ ఎమ్మెల్యే, ఎంపీలపైనే నిరసనకు దిగడం జిల్లాలో సంచలనం సృష్టించింది. గతంలో ఎమ్మెల్యే శ్రావణిపై ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్‌కు రాతపూర్వకంగా కూడా ఫిర్యాదు చేయడం గమనార్హం. తాజా పరిణామాలు ఉమ్మడి అనంతపురం జిల్లాలో పాలన గాడి తప్పిన విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. పోలీసులు నిస్సహాయులుగా మారి అన్నింటినీ చూస్తూ ఉండడం తప్ప ఏమీ చేయలేకపోతున్నారు.

బయటకు వచ్చిన బఫర్

- ఆర్‌ఎస్‌కేలకు 165 మెట్రిక్ టన్నుల యూరియా తరలింపు



యూరియా బస్తాలు

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం అగ్రికల్చర్: ఎట్టకేలకు బఫర్‌స్టాక్‌ను వ్యవసాయ శాఖ, మార్క్‌ఫెడ్ అధికారులు బయటకు తీశారు. రైతులు కష్టాలు పడుతున్నా గోదాముల్లో నిల్వ చేసిన యూరియాను బయటకు తీయడం లేదని 'బఫర్ స్టాక్... బయటకు తీస్తే ఒట్టు' శీర్షికతో శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. యూరియా కొరత, బఫర్‌స్టాక్, రైతుల కష్టాలపై 'సాక్షి'లో వస్తున్న వరుస కథనాలపై జిల్లా యంత్రాంగం సీరియస్ అయినట్లు తెలిసింది. ఎక్కడా సమస్య ఉత్పన్నం కాకుండా సమన్వయం చేసుకోవాలని వ్యవసాయశాఖ, మార్క్‌ఫెడ్ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ఈ క్రమంలో రైతుల నుంచి డిమాండ్, వరి, మొక్కజొన్న విస్తీర్ణం అధికంగా ఉన్న ప్రాంతాలకు శుక్రవారం బఫర్‌స్టాక్ నుంచి యూరియా సరఫరా చేశారు. 13 ఆర్‌ఎస్‌కేలకు 165 మెట్రిక్ టన్నులు పంపినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతానికి ఒక్కో ఆర్‌ఎస్‌కేకు ఒక లారీ యూరియా అందుబాటులో ఉంచామన్నారు. ఇది కాకుండా ఇప్పటికే ఆర్‌ఎస్‌కేల్లో 150 మెట్రిక్ టన్నుల వరకు నిల్వ ఉన్నట్లు వెల్లడించారు. శనివారం రాష్ట్రీయ కెమికల్స్ ఫర్టిలైజర్స్ (ఆర్‌సీఎఫ్) నుంచి 250 మెట్రిక్ టన్నుల మేర యూరియా సరఫరా కానుందన్నారు. ఇందులో 70 శాతం మార్క్‌ఫెడ్, మిగతా 30 శాతం ప్రైవేట్ హోల్‌సేల్ డీలర్లకు సరఫరా చేస్తామన్నారు.

ప్రతి చెరువునూ నీటితో నింపాలి

- కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: జిల్లాలో ప్రతి చెరువునూ నీటితో నింపాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. వివిధ అంశాలపై కలెక్టర్ శుక్రవారం తన క్యాంపు కార్యాలయం నుంచి డివిజన్, మండల స్థాయి అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, ఇరిగేషన్, ఐసీడీఎస్, తదితర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 304 చెరువులను నీటితో నింపి భూగర్భజలాలు పెంచేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఎరువుల కొరత తలెత్తకుండా చూడాలన్నారు. అధిక ధరలకు యూరియా విక్రయిస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మునిసిపాలిటీల్లో పారిశుధ్య పనులు వందశాతం జరగాలన్నారు. జిల్లాలోని 21 సబ్‌స్టేషన్ల చుట్టూ సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. 'పీఎం కుసుమ్' కింద 111 మెగావాట్ల సోలార్ ఇంధన ఉత్పత్తికి 499.5 ఎకరాల భూమి అవసరమవుతుందన్నారు. ప్రైవేటు భూమిని రైతుల నుంచి కొనుగోలు చేస్తామని కంపెనీలు చెబుతున్నాయన్నారు. ఇందుకు సంబంధించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో తాను కూడా ఒక సబ్‌స్టేషన్ తనిఖీ చేస్తానన్నారు. ఆర్‌డీఓలు వారి పరిధిలోని సబ్‌స్టేషన్లు తనిఖీ చేయాలన్నారు. వారం రోజుల్లో భూ సమస్యలు పరిష్కరించాలన్నారు. ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని అల్ట్రా మెగా సోలార్ పార్కు కోసం భూమిని సేకరించాలన్నారు. ఎంఎస్ఎంఈ పార్కుల కోసం గుంతకల్లు, శింగనమల, రాయదుర్గం నియోజకవర్గాల్లో 50 ఎకరాల చొప్పున భూమిని గుర్తించాలన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

నాటుసారా నిర్మూలనే లక్ష్యం

జిల్లాలో నాటుసారా నిర్మూలనే లక్ష్యమని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. 'నవోదయం 2.0'పై కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ నాటుసారా నిర్మూలనలో ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించే దిశగా చర్యలను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. యువత మత్తుకు బానిస కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఇటీవల గంజాయి కేసులు నమోదవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఎ.మలోల, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కంది జోరు.. వేరుశనగ బేజారు!

ఖరీఫ్ సాగు @ 65 శాతం

- తొలిసారి వేరుశనగను అధిగమించిన కంది
- 2.21 లక్షల హెక్టార్లలో సాగు
- ఇంకా 1.20 లక్షల హెక్టార్లు బీడు
- ప్రత్యామ్నాయంపై స్పష్టత ఇవ్వని కూటమి సర్కారు



అనంతపురం అగ్రికల్చర్: అరకొర పదును.. అననుకూల వర్షాలు వెరసి ఈ ఏడాది ఖరీఫ్ పంటల సాగు అతికష్టమ్మీద 'సాగు'తోంది. మునుపెన్నడూ లేని విధంగా నైరుతి రుతుపవనాలు ముందుగానే మురిపించినా కీలక సమయమైన జూన్, జూలైలో మొహం చాటేశాయి. జూన్‌లో సాధారణం కన్నా 21.7 శాతం తక్కువగానూ, కీలకమైన జూలైలో కూడా 46.4 శాతం తక్కువగా వర్షాలు పడటంతో ఖరీఫ్ మందకొడిగానే సాగింది. తీరా పంటలు విత్తుకునే గడువు ముగిసిన తర్వాత ఆగస్టు 5 నుంచి విస్తారంగా వర్షాలు కురిశాయి. జూన్ ఒకటి నుంచి ఆగస్టు 5 వరకు అంటే 65 రోజుల్లో 130 మి.మీ గానూ 37 శాతం తక్కువగా 82.7 మి.మీ వర్షం కురిసింది. ఆ తర్వాత ఆగస్టు 5 నుంచి ఆగస్టు 20 మధ్య 15 రోజుల్లోనే 40 మి.మీ గానూ ఏకంగా 150 మి.మీ వర్షపాతం నమోదైంది. కేవలం 15 రోజుల వ్యవధిలోనే 35 శాతం లోటున్న వర్షపాతం ఏకంగా 35 శాతం అధికంగా నమోదైంది. అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల మధ్య ఖరీఫ్ పంటల సాగు చేశారు. కరువు ఛాయలు కమ్మేశాయని ఆందోళన చెందుతున్న తరుణంలో వరుణుడు కరుణించాడు.

65 శాతం విస్తీర్ణంలో ఖరీఫ్..

ఈ ఖరీఫ్‌లో అన్ని పంటలు కలిపి 3,43,232 హెక్టార్లుగా అంచనా వేయగా... ఈనెల 26 నాటికి 65 శాతంతో 2.21 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు సాగులోకి వచ్చినట్లు వ్యవసాయశాఖ నివేదిక విడుదల చేసింది. వారం వారం వ్యవసాయశాఖ విడుదల చేస్తున్న సాగు గణాంకాలపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కొంచెం విస్తీర్ణం పెంచుతూ వస్తున్నారు. ఈ-క్రాప్ పూర్తయితే కాని సాగు లెక్కలపై స్పష్టత వచ్చే అవకాశం లేదని చెబుతున్నారు. తాజా నివేదిక పరిశీలిస్తే... జిల్లా చరిత్రలో తొలిసారిగా ప్రధాన పంటగా దశాబ్దాలుగా వెలుగొందుతున్న వేరుశనగ విస్తీర్ణం తగ్గిపోవడం గమనార్హం. 1.82 లక్షల హెక్టార్లు అంచనా వేయగా 72 వేల హెక్టార్లకు పరిమితమైంది. ఈ సారి వేరుశనగను అధిగమించి కంది పంట ఏకంగా 82,257 హెక్టార్లకు చేరుకోవడం విశేషం. ప్రధాన పంటల జాబితాలో ఉన్న పత్తి 44 వేల హెక్టార్లకు గానూ 21 వేల హెక్టార్ల వద్ద ఆగిపోయింది. ఆముదం కూడా 16,293 హెక్టార్లకు గానూ 10,400 హెక్టార్లకు పరిమితమైంది. మొక్కజొన్న పరిస్థితి కాస్త మెరుగ్గా ఉంది. 14,653 హెక్టార్లకు గానూ 16,700 హెక్టార్లకు పెరిగింది. ఇటీవల వరి నాట్లు ఊపందుకోగా... 19,446 హెక్టార్లకు గానూ ప్రస్తుతానికి 14 వేల హెక్టార్ల వద్ద కొనసాగుతున్నాయి. మిగతా పంటల విషయానికి వస్తే... సజ్జ 3,300 హెక్టార్లు, కొర్ర 950 హెక్టార్లు, జొన్న 350 హెక్టార్లు, అలసంద 150 హెక్టార్లు, పొద్దుతిరుగుడు 600 హెక్టార్లలో వేశారు.

'ప్రత్యామ్నాయం' చూపని కూటమి..

65 శాతం విస్తీర్ణంలో ఖరీఫ్ పంటలు సాగులోకి రాగా ఇంకా 35 శాతం అంటే 1.20 లక్షల హెక్టార్ల భూములు బీళ్లగానే దర్శనమిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఏ పంట వేసుకోవాలో రైతులకు అర్థం కావడం లేదు. 'ప్రత్యామ్నాయం' చూపడంలో కూటమి సర్కారు వేచిచూసే ధోరణి అవలంభిస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తోంది. ఇలాంటి పరిస్థితులు ఏర్పడినపుడు ఆగస్టు మూడో వారంలో ఉలవ, పెసర, అలసంద, కొర్ర, జొన్న లాంటి విత్తనాలను ప్రత్యామ్నాయం కింద పంపిణీ చేసేవారు. అయితే ఈ సారి ప్రత్యామ్నాయం చూపుతారా.. చేతులెత్తేస్తారా అనే విషయంపై అటు వ్యవసాయశాఖ ఇటు సర్కారు పెద్దలు స్పష్టత ఇవ్వడం లేదు.

బై బై గణేశా



ఉరవకొండలో గణేశ్ విగ్రహ నిమజ్జన కోలాహలం



యల్లనూరులో నిమజ్జనానికి తరలుతున్న విగ్రహాలు

గణనాథుడు గంగ ఒడికి చేరాడు. జిల్లాలోని పలు చోట్ల శుక్రవారం వినాయక విగ్రహాల నిమజ్జనం కోలాహలంగా జరిగింది. ఊరేగింపుగా తీసుకెళ్లి వినాయక ప్రతిమలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా యువత కేరింతలు కొట్టారు. చిన్నాపెద్దా ఉత్సాహంగా డ్యాన్సులు చేస్తూ, ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ముందుకు కదిలారు.

\- సాక్షి నెట్‌వర్క్



అనంతపురంలో లంబోదరుడి నిమజ్జనం



గంగమ్మ ఒడికి చేరిన విఘ్ననాయకుడు



అనంతపురంలో నిమజ్జనం సందర్భంగా యువత కేరింతలు



ఆత్మకూరులో విగ్రహాల ఊరేగింపు సందర్భంగా సందడి

ఇంగ్లిష్‌పై పట్టులేక చేజారిన ఉద్యోగం

- మంచి ర్యాంకు సాధించినా పీజీటీ పోస్టు కోల్పోయిన అభ్యర్థి
- రెండోరోజూ ప్రశాంతంగా సర్టిఫికెట్ల పరిశీలన
- వివిధ కారణాలతో 9 మంది పెండింగ్

అనంతపురం ఎడ్యుకేషన్: డీఎస్సీలో మంచి ర్యాంకు సాధించాడు. అయితే ఇంగ్లిష్ ప్రొఫిషియెన్సీ(ప్రావీణ్యం) పరీక్ష పాస్ కాని కారణంగా ఓ అభ్యర్థి పీజీటీ పోస్టు కోల్పోయాడు. డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన రెండో రోజు శుక్రవారం కూడా ప్రశాంతంగా సాగింది. గురువారం హాజరుకాని అభ్యర్థులకూ అవకాశం కల్పించడంతో రెండు రోజులకు కలిపి మొత్తం 757 మంది అభ్యర్థులకు కాల్‌లెటర్లు అందాయి. వీరిలో వివిధ కారణాలతో 9 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పెండింగ్ పెట్టారు. కొన్ని సర్టిఫికెట్లు లేని కారణంగా హాజరైన వారిలో ముగ్గురివి పెండింగ్ పడగా, ఒక అభ్యర్థి ఫోన్ పని చేయలేదు. మరొక అభ్యర్థి బెంగళూరులో స్థిరపడ్డానని, తనకు ఇష్టం లేదని స్పష్టత ఇచ్చాడు. కేజీబీవీలో సీఆర్టీగా పని చేస్తూ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్‌గా ఎంపికైన అభ్యర్థినిపై ఫిర్యాదు రావడంతో పెండింగ్ పెట్టారు. ఆమె సర్వీస్‌లో ఉంటూ జీతం తీసుకుంటూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సు చేసినట్లు ఫిర్యాదు అందింది. ఈమె తొలిరోజు హాజరైనా ఫిర్యాదు కారణంగా సర్టిఫికెట్లు పరిశీలన చేయించుకోకుండానే వెనుదిరిగింది. ఇంగ్లిష్ ప్రొఫిషియెన్సీ పరీక్ష పాస్ కాని కారణంగా మరో అభ్యర్థిని రిజెక్ట్ చేశారు. స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఓ టీచరు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పోస్టుకు ఎంపికయ్యాడు. అయితే, ప్రిన్సిపాల్‌గా పని చేసిన అనుభవం లేకపోవడంతో ఆయన ఈ పోస్టుకు అనర్హుడయ్యాడు. మొత్తం మీద జిల్లాలో 807 పోస్టులకు నోటిఫికేషన్ జారీ కాగా.. రెండు రోజుల్లో 757 మంది అభ్యర్థులకు కాల్‌లెటర్లు అందాయి. ఇంకా 50 పోస్టులపై స్పష్టత రావాల్సి ఉంది. దీనిపై రాష్ట్ర అధికారుల నుంచి సమాచారం అందాల్సి ఉందని జిల్లా అధికారులు చెబుతున్నారు. స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్, జిల్లా పరిశీలకులు సుబ్బారావు, డీఈఓ ప్రసాద్‌బాబు ప్రక్రియను పర్యవేక్షించారు. పారదర్శకంగా సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టామని వారు స్పష్టం చేశారు.



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

క్లుప్తంగా

ఎరువుల విక్రయాల నిలుపుదల



ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీ చేస్తున్న దృశ్యం

తాడిపత్రి రూరల్/అనంతపురం: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో శుక్రవారం విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. తాడిపత్రిలో నిల్వల్లో వ్యత్యాసాలను గుర్తించి మాకం ఎరువుల దుకాణంలో రూ.74 వేలు, భవాని ఫర్టిలైజర్స్‌లో రూ.3.98.600, శ్రీలక్ష్మీవేంటేశ్వర ఫర్టిలైజర్స్‌లో రూ.1,98,650 విలువ చేసే ఎరువుల విక్రయాలను నిలుపుదల చేస్తూ నోటీసులు ఇచ్చారు. తనిఖీల్లో వ్యవసాయాధికారులు వాసుప్రకాష్, డీసీటీఓ రమేష్, విజిలెన్స్ ఎస్ఐ నరేంద్రభూపతి పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతకు క్రీడలు దోహదం : డీఆర్ఎం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఆర్ఎం సీఎస్ గుప్తా

గుంతకల్లు: నిత్యం పని ఒత్తిడితో సతమతమయ్యే ఉద్యోగులకు క్రీడల ద్వారా మానసిక ప్రశాంత లభిస్తుందని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక రైల్వే గ్రౌండ్‌లో రైల్వే ఉద్యోగులకు నిర్వహించిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. రైల్వే ఉద్యోగులు ఆరోగ్యకరమైన జీవనం గడపడానికి అనేక క్రీడా సౌకర్యాలను కల్పించినట్లు తెలిపారు. అందులో భాగంగా రైల్వే గ్రౌండ్‌ను ఆధునీకరించడంతోపాటు జిమ్‌ను ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్, సీనియర్ డీఓఎం శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వణికిస్తున్న జ్వరాలు

- జిల్లా వ్యాప్తంగా విష జ్వరాల విజృంభణ
- ప్రతి ఇంటా మంచాన పడుతున్న ఒకరిద్దరు
- ఆస్పత్రుల్లో పెరుగుతున్న ఓపీ, ఐపీ కేసులు
- కలవరపెడుతున్న డెంగీ

రాయదుర్గం/గుంతకల్లు రూరల్: వాతావరణంలో మార్పుల కారణంగా జిల్లా వ్యాప్తంగా విషజ్వరాలు విజృంభించాయి. జ్వరం బారిన పడిన ప్రజలు మంచం దిగలేకపోతున్నారు. పిల్లల్లో వైరల్ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. వైరల్‌తో పాటు కాలానుగుణంగా వచ్చే మలేరియా, డెంగీ కేసులు గుబులు రేపుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకూ 3,153 మందికి రక్త పూతలు సేకరించగా ఇందులో 37 డెంగీ కేసులు నిర్ధారణ అయినట్లు అధికారిక రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. 3,10,244 మందికి రక్త నమూనాలు సేకరించగా 4 మలేరియా కేసులు నమోదైనట్లు సమాచారం. జిల్లాలోని రాయదుర్గం, ఉరవకొండ, కళ్యాణదుర్గం, గుంతకల్లు, తాడిపత్రి ప్రాంతాల్లో డెంగీ కేసులు అక్కడక్కడ నమోదయ్యాయి.

పెరుగుతున్న ఓపీ

రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో గత మూడు రోజులుగా 800 నుంచి 900 వరకూ ఓపీ నమోదవుతోంది. ఇందులో 200 మందికి పైగా జ్వర పీడితులే ఉంటున్నారు. పేరుకు వంద పడకల ఆస్పత్రైనా, 50 పడకలే ఉన్నాయి. ఆస్పత్రి నిర్మాణం అర్ధాంతరంగా ఆగడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఒక్కో పడకపై ఇద్దరు, ముగ్గురు చొప్పున ఉంటున్నారు. సరిపడ వైద్యులు, సిబ్బంది లేక నాణ్యమైన వైద్య సేవలు అందక రోగులు సతమతమవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇదే పరిస్థితి. దోమ పుట్టకుండా– కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు, పాలకులు చేతులెత్తేయడంతో దోమకాటుకు గురై పల్లెలు, పట్టణాల్లో ప్రజలు మంచాన పడుతున్నారు.

ప్రైవేటు ల్యాబ్‌ల దోపిడీ

జ్వరం అంటూ డాక్టర్ వద్దకెళితే చాలు రోగి చేతిని కూడా ముట్టకుండానే రక్త పరీక్షలకు రెఫర్ చేస్తున్నారు. దీంతో ప్రైవేటు ల్యాబ్‌ల నిర్వాహకులు దోపిడీకి తెరలేపారు. డాక్టర్లకు కమీషన్లు ఎర వేస్తూ ఇష్టానుసారంగా రోగులను దోచుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. డెంగీ రోగులను ప్రభుత్వ ఆస్పత్రులకు రెఫర్ చేయాల్సి ఉండగా... ఇందుకు విరుద్ధంగా ప్రైవేటు ఆస్పత్రుల్లోనే చికిత్స అందజేస్తున్నారు. పరిస్థితి విషమించినప్పుడు ప్రభుత్వాస్పత్రులకు రెఫర్ చేస్తుండడంతో మృతుల సంఖ్య పెరుగుతోంది.

నెల రోజులుగా అదుపులోకి రాని పరిస్థితి

గుంతకల్లు మండలంలోని కసాపురం గ్రామంలో నెల రోజులుగా విష జ్వరాలు పట్టి పీడిస్తున్నాయి. పరిస్థితిలో ఏ మాత్రం మార్పు రావడం లేదు. గ్రామానికి చెందిన షేక్ బీబీ నెల రోజుల క్రితం డెంగీ బారిన పడి మృతిచెందింది. అప్పటి నుంచి ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. 1,100 కుటుంబాలు, 4,500 పైగా జనాభా ఉన్న ఈ గ్రామంలో పారిశుధ్యం లోపించడంతో దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రతి ఇంట్లోనూ ఒకరి కంటే ఎక్కువ మంది జ్వరాలతో మంచం పట్టారు. గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్రం ఉన్నా.. ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణకు తప్ప ప్రజల ఆరోగ్యం గురించి పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. దీంతో దిక్కుతోచని గ్రామస్తులు పట్టణ ప్రాంతాల్లో వైద్యుల వద్దకు వెళ్లలేక అందుబాటులో ఉన్న ఆర్ఎంపీలతో చికిత్స చేయించుకుంటున్నారు.



రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

ఇబ్బంది పడుతున్నాం



మా ఇంట్లో నాతో పాటు, నా తమ్ముడి పిల్లలిద్దరూ జ్వరంతో పది రోజులుగా బాధ పడుతున్నాం. దీనికి తోడు దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు తోడయ్యాయి. చికిత్స చేయించుకునేందుకు ఆర్థిక స్థోమత సరిపోవడం లేదు.
– లక్ష్మి, కసాపురం, గుంతకల్లు మండలం

దోమల బెడద ఎక్కువైంది



గ్రామంలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదు. దీంతో దోమల బెడద తాళలేకున్నాం. ఇంటి బయట రెండు నిమిషాలు కూడా నిలబడలేం. పది రోజుల వ్యవధిలో నా ఇద్దరు కుమార్తెలూ జ్వరం బారిన పడ్డారు. గుంతకల్లులో చికిత్స చేయిస్తున్నా.
– భరద్వాజ్, కసాపురం, గుంతకల్లు మండలం

ఓపీ పెరిగింది



మూడు, నాలుగు రోజులుగా రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో ఓపీ, ఐపీ కేసులు ఎక్కువయ్యాయి. ఇందులో ఎక్కువ శాతం వైరల్ జ్వరాల కేసులే ఉన్నాయి. అత్యవసరమైన వారిని ఐపీలో ఉంచి చికిత్స చేస్తున్నాం.
– మెర్జీ జ్ఞానసుధ, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, రాయదుర్గం

అధికారులు స్పందించాలి



11 నెలల వయసున్న నా మనవరాలు వారం రోజులుగా జ్వరంతో బాధ పడుతోంది. మూడు రోజులుగా తీవ్రమైన జ్వరం, ఒళ్లు నొప్పులతో నేనూ మంచం పట్టాను. ప్రతి ఇంట్లోనూ ఒకరి తర్వాత ఒకరు జ్వరాల బారిన పడుతున్నారు. కనీసం ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.
– విరుపాక్షి రెడ్డి, కసాపురం, గుంతకల్లు మండలం

దోమలతో జాగ్రత్త

దోమ కాటుతోనే జ్వరాలు ప్రబలుతున్నాయి. నీటి నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. డెంగీ కేసులు బయటపడిన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం. మలేరియా వ్యాప్తి తక్కువగా ఉంది. వాతావరణంలో మార్పుల కారణంగా వైరల్ జ్వరాలు అధికంగా ఉంటున్నాయి. ప్రధానంగా దోమ కాటుకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
– ఓబుళు, జిల్లా మలేరియా అధికారి, అనంతపురం

కొండలపై రేసింగ్



ఎల్లుట్ల వద్ద ప్రమాదానికి గురైన స్పోర్ట్స్ బైక్

పుట్లూరు/శింగనమల: వ్యవసాయం మినహా ఏమీ ఎరుగని గ్రామీణ ప్రాంతాల్లో శుక్రవారం స్పోర్ట్స్ బైక్‌ల మోత మోగింది. పుట్లూరు మండలం మడుగుపల్లి, ఎల్లుట్ల సమీపంలోని కొండలపై గాలిమరల వద్ద కారు, బైక్ రేసింగ్ టెస్ట్ డ్రైవ్ నిర్వహించారు. అయితే ఓ స్పోర్ట్స్ బైక్ రైడర్ నియంత్రణ కోల్పోయి ఎల్లుట్ల నుంచి నార్పలకు వెళుతున్న ద్విచక్ర వాహనదారుడు బాలాజీని ఢీకొన్నాడు. ఘటనలో బాలాజీకి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వెంటనే అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. కాగా, బెంగళూరుకు చెందిన మోటార్ స్పోర్ట్స్ నిర్వాహకులు శింగనమల, బుక్కరాయసముద్రం, పుట్లూరు ప్రాంతాల్లోని గాలిమరల రహదారులను రేసింగ్ కోసం శుక్రవారం పరిశీలించారు. దాదాపు 32 స్పోర్ట్స్ బైక్‌లు, 16 కారులతో టెస్ట్ రేసింగ్ నిర్వహించారు. మూడు రోజుల పాటు ఈ రేసింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఈ సందర్భంగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

తెలుగు భాషా ఉద్యమ పితామహుడు గిడుగు



గిడుగు రామమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, అధికారులు

అనంతపురం అర్బన్: తెలుగు వాడుక భాష ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి అని కలెక్టర్ వినోద్‌కుమార్ కొనియాడారు. గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవాన్ని శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. గిడుగు రామమూర్తి చిత్రపటానికి కలెక్టర్ పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించి, మాట్లాడారు. వ్యవహారిక భాషోద్యమానికి మూలపురుషుడు గిడుగు రామమూర్తి అని, గ్రాంధిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకొచ్చి నిత్య వ్యవహారంలోని భాషలో ఉన్న వీలును తెలియజెప్పిన మహనీయుడని కీర్తించారు. కొద్దిమందికే పరిమితమైన చదువు రామమూర్తి కారణంగా వ్యవహారిక భాషలో సాగి అందరికీ అందుబాటులోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ ఎ.మలోల, కలెక్టరేట్ పరిపాలనాధికారి అలెగ్జాండర్, కో–ఆర్డినేషన్ సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి, డీఎస్పీ శ్రీనివాసరావు, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సంతానం కలుగలేదని వివాహిత ఆత్మహత్య



లక్ష్మి (ఫైల్)

గుమ్మఘట్ట: మండలంలోని 75వీరాపురం గ్రామానికి చెందిన వివాహిత లక్ష్మి (35) ఆత్మహత్య చేసుకుంది. గ్రామానికి చెందిన లింగప్పకు నేత్రపల్లి గ్రామానికి చెందిన లక్ష్మితో 17 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి సంతానం లేదు. పలువురు వైద్యులను సంప్రదించినా ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆమె శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు చుట్టుపక్కల వారి సాయంతో రాయదుర్గంలోని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతిచెందినట్లు ధ్రువీకరించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.





అర్హులైన దివ్యాంగులకు పింఛన్ : కలెక్టర్

అనంతపురం అర్బన్: అర్హులైన దివ్యాంగులందరికీ పింఛను అందజేస్తామని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. ఈ నెల 30న సాయంత్రం 5 గంటల వరకు అప్పీలు చేసిన దివ్యాంగులందరికీ సెప్టెంబరు 1వ తేదీన పింఛను చెల్లిస్తారన్నారు. దివ్యాంగుల పింఛన్ల అంశంపై శుక్రవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో డీఎంహెచ్ఓ ఈబీదేవి, సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆత్మారాంతో కలసి విలేకరులతో కలెక్టర్ మాట్లాడారు. 40 శాతం, అంతకంటే ఎక్కువ వైకల్యం ఉండి తాత్కాలిక సర్టిఫికెట్ కలిగిన 2,123 మందికి, ఎంఆర్, ఎంఐ ఉన్న 18 సంవత్సరాల కంటే తక్కువ వయసున్న 35 మంది పిల్లలకు, 40 శాతం కంటే తక్కువ ఉండి అప్పీలు చేసుకున్న 5,241 మందికి పింఛను కొనసాగుతుందన్నారు. సదరంలో ఇంకనూ పునఃపరిశీలనకు పంపని 9,263 సర్టిఫికెట్‌లు ఉన్నాయన్నారు. అర్హత ఉన్న ప్రతి దివ్యాంగునికి పింఛను కొనసాగుతుందని అన్నారు.

'దుర్గం'లో దొంగ నోట్ల హల్‌చల్

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలో దొంగనోట్ల చెలామణి వెలుగు చూసింది. బ్రహ్మయ్య గుడి వద్ద ఉన్న ఓ టీ కేఫ్‌లో శుక్రవారం మధ్యాహ్నం కళ్లజోడు ధరించిన వ్యక్తి ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు నటిస్తూ రూ.200 నోటును నిర్వాహకురాలు యశోదమ్మ ఇచ్చాడు. రెండు సిగరెట్లు తీసుకోని చిల్లర రూ.160 తీసుకుని వెళ్లిపోయాడు. అయితే అది దొంగ నోటుగా ఆలస్యంగా గుర్తించిన నిర్వాహకురాలి సమాచారంతో విషయాన్ని కొందరు యువకులు సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తూ ప్రజలను అప్రమత్తం చేశారు. ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అక్రిడిటేషన్ల గడువు పొడిగింపు

అనంతపురం అర్బన్: జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువును ప్రభుత్వం మరో మూడు నెలలు పొడిగించింది. సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా ఉత్తర్వులు మేరకు కలెక్టర్ వి.వినోద్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత గడువు ఈ నెల 30తో ముగియనుంది. సెప్టెంబరు 1 నుంచి నవంబరు 30వ తేదీ వరకు, లేదా కొత్త కార్డులు జారీ చేయడంలో ఏదీ ముందు జరిగితే అప్పటి వరకు పొడిగింపు ఉంటుంది.

కౌన్సిల్‌లో చైర్‌పర్సన్ కన్నీళ్లు

- పట్టణ సమస్యలు పట్టించుకోని అధికారుల తీరుపై అసంతృప్తి
- అజెండాలకే పరిమితమవుతున్నారని ఆగ్రహం



కంటి తడి పెట్టుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని (చిత్రంలో) కమిషనర్ నయీమ్

గుంతకల్లు: మున్సిపల్ అధికారుల తీరుపై గుంతకల్లు మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని కంటతడి పెట్టుకున్నారు. శుక్రవారం గుంతకల్లు మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అభివృద్ధి పనుల విషయంలో మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదంటూ కౌన్సిల్ హాల్లో చైర్‌పర్సన్ భవాని కన్నీళ్లు పెట్టుకున్నారు. తాను ఆదేశించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

సమావేశం ప్రారంభం కాగానే తొలుత అజెండాలోని పలు అంశాలపై చర్చ సాగింది. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ లింగన్న మాట్లాడుతూ.. తమ వార్డు పరిధిలో రూ. లక్షల వ్యయంతో కూడిన పనులకు సంబంధించిన అంశాలు అజెండాలో కనిపిస్తున్నాయని, అయితే క్షేత్ర స్థాయిలో ఆ పనులు ఎక్కడేగాని కనిపించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. కౌన్సిల్ సమావేశాలకు హాజరు కావడం.. ఇచ్చిన స్నాక్స్ తిని, టీ తాగి అజెండాను ఆమోదించి వెళ్లిపోవడం తప్ప కౌన్సిలర్లు ఎందుకు పనికిరాకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి పథకానికి సంబంధించి రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన పంప్ హౌస్‌లో రూ.50 లక్షలు విలువ చేసే మోటార్లు అపహరణకు గురైతే రూ.50 వేల విలువ యంత్రాలను అపహరించినట్లుగా కేసు నమోదు చేయించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. నెలలు గడుస్తున్న చోరీ సూత్రధారులు ఎవరైంది కనిపెట్టలేకపోయారని మండిపడ్డారు. వైకల్యం కంటికి స్పష్టంగా కనిపిస్తున్నా.. పింఛన్లు తొలగించడం అన్యాయమని కౌన్సిలర్లు జేసీబీ చాంద్‌బాషా, కుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు.

కౌన్సిలర్లు పవన్‌గౌడ్, కందూరి కృపాకర్ మాట్లాడుతూ.. తమ వార్డులో అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచినా పనులు మాత్రం చేపట్టలేదన్నారు. చిన్నపాటి మరమ్మతు పనులు కూడా చేయకపోతే ఎలా అంటూ ప్రశ్నించారు. ఈ పనులకు టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. కౌన్సిలర్ మెహరున్నీషా బేగం మాట్లాడుతూ.. సత్యనారయణపేటలోని హిందూ శ్మశాన వాటికలో మౌలిక వసుతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహమ్మద్, ఏసీ లక్ష్మీదేవి, ఎంఈ ఇంతియాజ్ అలి, డీఈలు షబానా, సుమ, ప్రకాష్‌నాయుడు, మెప్మా ప్రాజెక్ట్ ఆఫీసర్ మోహన్, టీపీ సూపర్‌వైజర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం వెలికి తీత



పవన్ (ఫైల్)

బొమ్మనహాళ్: కర్ణాటకలోని కుడితిని ఠాణా పరిధిలో తిమ్మలాపురం వద్ద హెచ్చెల్సీలో గల్లంతైన ఓ యువకుడు శుక్రవారం ఉదయం బొమ్మనహాళ్ మండలం దేవగిరి క్రాస్ వద్ద మృతదేహమై తేలాడు. పోలీసులు తెలిపిన మేరకు... నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డిపల్లికి చెందిన పవన్ (22) దుస్తుల వ్యాపారంతో పాటు లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉన్నాడు. ఈ క్రమంలో లారీ లోడు తీసుకుని కొన్ని రోజుల క్రితం కర్ణాటకలోని కుడితిని ప్రాంతానికి వచ్చాడు. ఈ నెల 19న తిమ్మలాపురం సమీపంలో హెచ్చెల్సీలో ఈత కొట్టేందుకు నీటిలో దిగిన పవన్.. ప్రవాహ వేగానికి గల్లంతయ్యాడు. శుక్రవారం ఉదయం దేవగిరి క్రాస్ వద్ద డిస్ట్రిబ్యూటరీ కాలువలో ఓ మృతదేహాన్ని గుర్తించిన స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, వెలికి తీశారు. హెచ్చెల్సీ ఎగువ ప్రాంతాల్లోని పీఎస్‌లకు స్థానిక పోలీసులు సమాచారం ఇవ్వడంతో కుడితిని పోలీసులు స్పందించి అందజేసిన వివరాలు సరిపోవడంతో మృతుడిని పవన్‌గా నిర్ధారించారు. మృతుడి తండ్రి పెద్దరాజు ఫిర్యాదు మేరకు కుడితిని పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ప్రేమ తిరస్కారం... యువకుడి బలవన్మరణం

కూడేరు: తన ప్రేమను యువతి నిరాకరించడంతో క్షణికావేశానికి లోనై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కనగానపల్లి మండలం గుంతపల్లికి చెందిన నారాయణ కుమారుడు అనిల్‌కుమార్ (28) కొంత కాలంగా ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. అయితే ఆమె అంగీకరించకపోవడంతో క్షణికావేశానికి లోనైన అనిల్ కుమార్.. సెల్ఫీ వీడియో తీసి ఇన్‌స్టాగామ్‌లో అప్‌లోడ్ చేసి శుక్రవారం కూడేరు మండలం గొటుకూరు సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ వెంచర్‌లో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై సీఐ రాజు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కియా ఉద్యోగి అదృశ్యం



గురుప్రసాద్

పెనుకొండ రూరల్: కియా అనుబంధ పరిశ్రమలో పనిచేస్తున్న యువకుడు కనిపించకుండా పోయాడు. ఘటనపై బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు కియా ఎస్ఐ రాజేష్ శుక్రవారం తెలిపారు. వివరాలు... అనంతపురం జిల్లా శెట్టూరుకు చెందిన మైలారప్పకుమారుడు గురుప్రసాద్ ఇటీవల కియా అనుబంధ పరిశ్రమలో కార్మికుడిగా చేరాడు. గుట్టూరులో తనకు కేటాయించిన గదిలోనే సెల్‌ఫోన్, ఇతర సామగ్రిని వదిలేసి వెళ్లిపోయాడు. యాజమాన్యం గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోవడంతో కుటుంబసభ్యులకు సమాచారం అందించింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు శుక్రవారం ఉదయం కియా పీఎస్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. తన కుమారుడి మానసిక పరిస్థితి సరిగా లేదని ఫిర్యాదులో గురుప్రసాద్ తండ్రి మైలారప్ప పేర్కొన్నారు.

తహసీల్దార్ సంతకం ఫోర్జరీ!

సాక్షి టాస్క్‌ఫోర్స్: స్థానిక తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి మాన్యువల్‌గా జారీ చేసిన ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ శుక్రవారం కలకలం రేపింది. ఈ సంతకం కొంతకాలం క్రితం బదిలీపై వచ్చిన తహసీల్దార్‌ది కావడం గమనార్హం. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. తాడిపత్రికి చెందిన ఓ యువతి గ్రూప్ –2 పరీక్షలకు సిద్ధమవుతూ అర్హత లేకున్నా ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్‌తో లబ్ధి పొందేందుకు ప్రయత్నించింది. ఈ అంశంలో తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ అధికారి కీలకంగా వ్యవహరించినట్లు సమాచారం. తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి మాన్యువల్‌గా సర్టిఫికెట్ జారీ చేశారు. వెరిఫికేషన్‌లో భాగంగా సర్టిఫికెట్‌ను స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) పంపింది. తన సంతకంతో కూడిన మాన్యువల్ సర్టిఫికెట్ చూడగానే తహసీల్దార్ సోమశేఖర్ నివ్వెరపోయారు. సంతకం చేసిన అధికారి గురించి అరా తీసి మందలించే ప్రయత్నం చేయడంతో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నట్లు తెలిసింది. విసయాన్ని కలెక్టర్ దృష్టికి తహసీల్దార్ తీసుకెళ్లినట్లు సమాచారం. దీనిపై సమగ్ర విచారణకు కలెక్టర్ ఆదేశించినల్లు తెలిసింది. దీంతో డిఫెన్స్‌లో పడిన సదరు అధికారి అధికార పార్టీ నేతల వద్దకు చేరుకుని పైరవీలకు తెరలేపినట్లు సమాచారం.



క్లుప్తంగా

క్రీడలూ అవసరమే


యువతను సత్కరిస్తున్న మై భారత్ సిబ్బంది

అనంతపురం కల్చరల్: చదువుతో పాటు కళలు, క్రీడలు అవసరమేనని మై భారత్ అధికారులు అన్నారు. శుక్రవారం స్థానిక మై భారత్ కార్యాలయంలో జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. మైభారత్ ప్రోగ్రాం ఇన్‌చార్జ్ గోవర్ధన శ్రీనివాసులు, స్టేట్ కోఆర్డినేటర్ బిసాతి భరత్, పోలీసు ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ చౌదరి, ప్రగతి పథం యూత్ అసోసియేషన్ ప్రతినిధులు రాష్ట్రపతి అవార్డు గ్రహీత జయమారుతి, మోదీ విచార్ మంచ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంబీ మహేష్‌బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సత్యసౌమ్య తదితరులు మాట్లాడారు. క్రీడలతోనే మానసిక, శారీరక ఆరోగ్యం సాధ్యమన్నారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనబరుస్తున్న యువతీ యువకులను సత్కరించారు. వలంటీర్లందరికీ ప్రశంసా పత్రాలు అందించారు. ప్రగతి పథం యూత్ అసోసియేషన్ సభ్యులు కార్తీక్, ఇందు, కృత్తిక పాల్గొన్నారు.

'మాసుమాబీ' వద్ద అన్నదానం


అన్నదానం చేస్తున్న రిజ్వాన్, తదితరులు

అనంతపురం కల్చరల్: స్థానిక పాతూరు మాసుమాబీ దర్గావద్ద దాదా ఖలందర్, వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్ ఆధ్వర్యంలో మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా శుక్రవారం రాత్రి అన్నదానం ప్రారంభించారు. బారా ఉర్సును పురస్కరించుకుని అన్నదానం, ఇతర సేవలు కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు వలి, శ్రీధర్, మాజీ మైనార్టీ ఈడీ తాజుద్దీన్, వైసీపీ నాయకులు బాషా పాల్గొన్నారు.

కోటి దీపోత్సవం


వినాయక విగ్రహం ముందు జ్యోతులు వెలిగిస్తున్న మహిళలు

రాప్తాడు: ప్రసన్నాయపల్లి పంచాయతీ చిన్మయనగర్‌లో గణేశ్ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజు శుక్రవారం ఇందిరమ్మకాలనీవాసులు వినాయక విగ్రహం వద్ద మహిళలు భక్తిశ్రద్ధలతో కోటి దీపోత్సవం నిర్వహించారు. అనంతరం వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

కల్యాణం.. కమనీయం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ఆత్మకూరు: పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం భాద్రపద మాస శుద్ధ షష్ఠి సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వర, శ్రీవల్లి, దేవసేన ఉత్సవ విగ్రహాలకు నిర్వహించిన కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. భక్తులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని పూజలు చేశారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కులధ్రువీకరణలో ఈడిగ అని వచ్చేలా చూడండి


కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రమిస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్: గ్రేటర్ రాయలసీమలోని ఈడిగలకు కులధ్రువీకరణ పత్రంలో పేరుకు ముందు గౌడ్ అని కాకుండా ఈడిగ అని వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఈడిగ సాధికారత సమితి సభ్యులు కోరారు. ఈమేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌ను సమితి సభ్యులు వేణుగోపాల్, నాగభూషణం, లక్ష్మీనారాయణ, సూరిబాబు, నారాయణ స్వామి, తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సమితి సభ్యులు వెంకటేష్, జగదీష్, రాజేంద్రబాబు పాల్గొన్నారు.

రిలయన్స్ క్రికెట్ టోర్నీకి ఎంపిక


జయంత్ కృష్ణ

అనంతపురం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే రిలయన్స్ క్రికెట్ ట్రోఫీలో జిల్లాకు చెందిన జయంత్ కృష్ణకు చోటు దక్కింది. గుజరాత్‌లోని అహమ్మదాబాద్ వేదికగా ఈ నెల 30 నుంచి రిలయన్స్ కప్ మల్టీడే క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నారు. టోర్నీలో ప్రాతినిధ్యం వహించే ఏపీ జట్టులో తాడిపత్రికి చెందిన జయంత్ కృష్ణకు దక్కడంపై జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి వి.భీమలింగారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.




ఆత్మకూరులో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు, రాప్తాడు పండమేరు వంకలో నిమజ్జనం చేస్తున్న దృశ్యం, వినాయకుడికి ప్రణమిల్లి వీడ్కోలు పలుకుతున్న భక్తులు

నిమజ్జనం..నీరాజనం

- కోలాహలంగా వినాయక నిమజ్జనం
- పలుచోట్ల మంటపాల్లో ప్రత్యేక పూజలు
- పెద్ద ఎత్తున అన్నదానాలు


కమలానగర్‌లో అన్నదానాన్ని ప్రారంభించిన దృశ్యం


భోజనం వడ్డిస్తున్న శ్రీసాయి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు


అన్నం వడ్డిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: నగరం, నగర పరిధిలోని రూరల్ మండలంలో వినాయక వినాయక చవితి సందడితో శుక్రవారం కూడా కొనసాగింది. పలు ప్రాంతాల్లో మూడోరోజు కోలాహలంగా నిమజ్జనం చేశారు. రాణీనగర్, ఐదోరోడ్డు నాల్గోరోడ్డు, ఎల్బీనగర్, హౌసింగ్ బోర్డు, హెచ్చెల్సీకాలనీ తదితర చోట్ల బాణ సంచా పేలుస్తూ, రంగులు చల్లుకుంటూ యువత కేరింతలు కొట్టారు.

అన్నదానం చేసిన మేయర్ : నగరంలో పలు చోట్ల అన్నదానాలు, హోమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. వివిధ చోట్ల మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, కార్పొరేటర్ కమల్ భూషణ్‌తో కలిసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీ నాయకులు పాల్గొన్నారు. కమలానగర్‌లో భారీ ఎత్తున అన్నదానం జరిగింది. కేజేఎం ప్రసాద్, కార్పొరేటర్ అబుసలేహ, ప్రసాదరెడ్డి, శివారెడ్డి, నాగ చితంబర్, అమర్, రమణారెడ్డి పాల్గొన్నారు.

రాప్తాడురూరల్: ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో అనంతపురం రూరల్ మండలం కొడిమి పంచాయతీ పరిధిలో జర్నలిస్టు కాలనీలో ఏర్పాటు చేసిన అయోధ్య వినాయకుడి నిమజ్జనం శుక్రవారం ఘనంగా జరిగింది. మూడురోజులుగా విశేష పూజలు నిర్వహించారు. చివరి రోజు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. అనంతరం జర్నలిస్టు కాలనీ వీధుల్లో వినాయక విగ్రహాన్ని ఊరేగించి, నిమజ్జనానికి తరలించారు. జర్నలిస్ట్ డెవలప్‌మెంట్ సొసైటీ అనంతపురం జిల్లా కార్యదర్శి విజయరాజు, వైస్ ప్రెసిడెంట్ నగేష్, జాయింట్ సెక్రటరీ మల్లికార్జున, ఉత్సవ కమిటీ సభ్యులు హరికృష్ణ, సూర్యప్రకాష్‌రెడ్డి, విష్ణు, శీన, రామకృష్ణ, జర్నలిస్టు కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 15వ డివిజన్‌లోని కమలానగర్‌లో శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్టార్ జ్యువెలరీ మార్ట్ యజమాని కేజేయం శివప్రసాద్, కమిటీ సభ్యులు కార్పొరేటర్ అబూసాలేహ, ప్రసాద్ రెడ్డి, శివారెడ్డి, జనార్దన్ రెడ్డి, నాగ చితంబర్, అమర్, రమణారెడ్డి, లింగమయ్య, అనిల్, రాజేష్, మధు, భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





నగరంలో కోలాహలంగా నిమజ్జనానికి తరలివెళ్తున్న వినాయకుడు, గణేశుడిని నిమజ్జనానికి మోసుకొస్తున్న చిన్నారి, గొందిరెడ్డిపల్లిలో నిమజ్జన ఊరేగింపు

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం


జేఎన్‌టీయూఏలో గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న వీసీ సుదర్శనరావు


తెలుగుతల్లి విగ్రహం వద్ద నీరాజనాలర్పిస్తున్న సాహితీవేత్తలు, భాషాభిమానులు

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని వివిధ స్కూళ్లల్లో తెలుగుభాషా దినోత్సవం, క్రీడోత్సవాలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ బి. హేమమాలిని అధ్యక్షత వహించారు. స్థానిక అశోక్‌నగర్‌లోని మినర్వా పాఠశాలలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. కరస్పాండెంట్ గొర్ల భాస్కర్‌రెడ్డి మాట్లాడారు. రామచంద్రనగర్‌లోని సెయింట్ అగస్టీన్ స్కూల్‌లో క్రీడా, తెలుగుభాష దినోత్సవం నిర్వహించారు.

అనంతపురం: తెలుగు వాడుక భాషకు ఆద్యుడు గిడుగు రామ్మూర్తి పంతులు అని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురంలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకలను పాలక భవనంలో నిర్వహించారు. ఓఎస్డీ టూ వీసీ ప్రొఫెసర్ ఎస్.దేవన్న, డైరెక్టర్లు పాల్గొన్నారు.

- అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ పాఠశాలలో మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. చైర్మన్ అనంతరాముడు, వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు, సీఏఓ నరసింహారావు, హెచ్ఎం శాలిని పాల్గొన్నారు.

అనంతపురం కల్చరల్: తెలుగు వాడుకభాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని అనంత రచయితలు, కవులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. తెలుగు భాషా పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ బి. నారాయణ ఆధ్వర్యంలో సప్తగిరి సర్కిల్ నుంచి తెలుగుతల్లి విగ్రహం వరకు ర్యాలీ చేశారు. రాజ్యమహిళా సమ్మాన్ అవార్డు గ్రహీత డాక్టర్ నల్లాని రాజేశ్వరి, శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా హరిహరజయ్యారు. సీనియర్ పద్య కవులు ఒంటెద్దు రామలింగారెడ్డి, గుడిపాటి సూర్యమ్ తదితరులు పాల్గొన్నారు. బ్రాహ్మణ కల్యాణ పరిచయ సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో డాక్టర్ బత్తలపల్లి సత్యరంగారావు మాట్లాడారు. కార్యక్రమంలో కేదార్‌నాథ్, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి కళ్లు తెరిపించు తల్లీ...

అనంతపురం ఎడ్యుకేషన్: మాతృభాషపై మొండిగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వానికి కళ్లు తెరిపించాలని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ (ఎస్ఎల్‌టీఏ) నాయకులు తెలుగుతల్లి విగ్రహానికి విన్నవించుకున్నారు. తెలుగు భాష అమలుపై ప్రభుత్వ ధోరణికి నిరసనగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎస్ఎల్‌టీఏ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని తెలుగుతల్లి విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలుగు భాషకు పట్టం కడతామని చెబితే కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టామన్నారు. అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత పూర్తిగా విస్మరిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎస్ఎల్‌టీఏ జిల్లా అధ్యక్షుడు వై.ఆదిశేషయ్య, ప్రధాన కార్యదర్శి జి.వేణుగోపాల్, నాయకులు ఆదిమూర్తి, శివమూర్తి, వలి, నాగరాజు, రాజునాయక్, విశ్వనాథరెడ్డి, లక్ష్మినారాయణ పాల్గొన్నారు. ఏపీ స్టేట్ ఎంప్లాయీస్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విజయభాస్కర్, ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రిస్వామి హాజరై సంఘీభావం ప్రకటించారు.


తెలుగుతల్లి విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎల్‌టీఏ నాయకులు


సంప్రదాయ దుస్తుల్లో అలరిస్తున్న అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థులు

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు


మాట్లాడుతున్న మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పద్మావతి

అనంతపురం అర్బన్: రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పార్వతీప్రసాద్, పద్మావతి విమర్శించారు. మహిళలకు రక్షణ కల్పించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. శుక్రవారం స్థానిక సంఘం కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడారు. రాష్ట్రంలో నిత్యం ఎక్కడో ఒక చోట మహిళలు, బాలికలు, చివరికి చిన్నారులపైనా లైంగిక దాడులు, హత్యలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలను కించపరుస్తూ ప్రజాప్రతినిధులే మాట్లాడడం బాధాకరమన్నారు. తన సతీమణిపై అనుచిత వ్యాఖలు చేశారని అప్పట్లో మీడియా సమావేశంలో చంద్రబాబు బోరున విలపించారని, అధికారంలోకొచ్చిన తర్వాత తిరిగి కేసులు పెడుతున్నారన్నారు. మరి ఇప్పుడు జూనియర్ ఎన్‌టీఆర్ తల్లిని అగౌరవపరుస్తూ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ వ్యాఖ్యలు చేస్తే ..కనీసం ఆయనపై రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. మీకో నీతి ఇతరులకు ఓ న్యాయమా? అంటూ ప్రశ్నించారు. మహిళలకు జరుగుతున్న దాడులు, అకృత్యాలకు ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సమాఖ్య నగర అధ్యక్ష, కార్యదర్శులు యశోద, జానకి, నాయకురాళ్లు ఆజాబీ, లక్ష్మీదేవి, జానకి, హరీఫా, ఫరీదా, అరుణ, లీలమ్మ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో రోగుల పట్ల నిర్లక్ష్యం


క్యాజువాలిటీలో పురుష రోగుల మధ్యలోనే మహిళకు ఈసీజీ తీస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని క్యాజువాలిటీలో పదుల సంఖ్యలో జనం మధ్య ఓ మహిళకు సిబ్బంది ఈసీజీ తీయడం విమర్శలకు తావిస్తోంది. వివరాలు.. నగరంలోని బుడ్డప్పనగర్‌కు చెందిన జీఏ కుమార్ తన భార్యకు శుక్రవారం రాత్రి ఛాతీనొప్పి రావడంతో సర్వజనాస్పత్రికి తీసుకువచ్చారు. కాగా డ్యూటీ మెడికల్ ఆఫీసర్ పరీక్షించి, ఈసీజీకి రెఫర్ చేశారు. ఈసీజీ కోసం అరగంటపైగానే సదరు మహిళ, సహాయకులు వేచి ఉన్నారు. ఈసీజీ టెక్నీషియన్ అందుబాటులో లేకపోవడంతో ఓ విద్యార్థిని ఈసీజీ తీసేందుకు వచ్చింది. జనం మధ్యలో ఈసీజీ తీస్తారని రోగి సహాయకుడు జీఏ కుమార్ విద్యార్థినిని ప్రశ్నించాడు. అయితే అక్కడున్న సిబ్బంది ఇక్కడ ఇలానే తీసేదని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. దీనిపై జీఏ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాసేపటికి వచ్చిన టెక్నీషియన్ స్క్రీన్ వేసుకోవాల్సింది మర్చిపోయామంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చింది. వాస్తవంగా ఈసీజీకి ప్రత్యేక గది ఉన్నా..దాన్ని టెక్నీషియన్లు వారి బ్యాగులు, తదితర సామగ్రిని ఉంచుతూ నిర్లక్ష్యం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని రోగులు, వారి సహాయకులు కోరుతున్నారు.

5 నుంచి రాష్ట్రస్థాయి నాటక పోటీలు

అనంతపురం కల్చరల్: మరోసారి అనంత వేదికగా రాష్ట్రస్థాయి నాటక పోటీలు జరుగనున్నాయి. భగవాన్ శ్రీ సత్యసాయి నాటకోత్సవ సమితి ఆధ్వర్యంలో వచ్చేనెల 5 నుంచి 9 వరకు జిల్లా కేంద్రంలోని కృష్ణకళామందిరం వేదికగా సాగే నాటక పోటీల వివరాలను దక్షిణభారత సాంస్కృతిక మండలి మాజీ సభ్యుడు మైఖేల్ బాబు తెలియజేశారు. 5న కర్నూలు వారి 'జగదేక సుందరి' పద్యనాటకం, 6న ఉదయం తెలంగాణకు చెందిన జోగులాంబ జిల్లా వారి 'సత్యా కృష్ణుల పరిణయ ఘట్టం' మధ్యాహ్నం లక్ష్మంపల్లి గ్రామానికి చెందిన 'బాలనాగమ్మ' నాటకం, సాయంత్రం పల్నాడు జిల్లా పెనుకొండ వారి శ్రీశివభక్త కుంటి మల్లారెడ్డి చారిత్రాత్మక పద్యనాటకం, హైదరాబాదుకు చెందిన 'స్వామి అయ్యప్ప' పూర్తి నాటకం 7న ఉదయం కల్యాణదుర్గం వారి 'మాయల మరాఠి', సాయంత్రం అనంతపురం వారి 'కార్యవర్తి' సీను, డీఆర్వో మలోల ప్రత్యేకంగా నటించే 'పడక సీను' కేపీహెచ్‌బీ కాలనీ వారి 'భక్తప్రహ్లాద' పౌరాణిక పద్య నాటకం, 8న ఉదయం అనకాపల్లికి చెందిన కళాకారుల 'గయోపాఖ్యానం' పౌరాణిక పద్య నాటకం, తెలంగాణ సూర్యాపేట్ జిల్లా వారి 'భక్త చింతామణి' కామక్కపల్లి వారి 'శ్రీకృష్ణ తులాభారం' సాయంత్రం కణేకల్ మండలం వారి 'సత్యహరిశ్చంద్ర' కాటి సీను, గుంటూరు జిల్లా వారి 'పల్నాడు యుద్ధం' నాటకాలు జరుగుతాయి. చివరిరోజు అనంత నాగ్ సంగీత్ ప్వర్గ్ కల్చరల్ అసోసియేషన్ వారి సంగీత విభావరి తో నాటక పోటీలు ముగుస్తాయి.

వ్యాయామం అలవాటు చేసుకోవాలి


క్రీడలను ప్రారంభిస్తున్న చక్రధరరెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలని ఎస్వీ డిగ్రీ,పీజీ కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధర రెడ్డి తెలియజేశారు. శుక్రవారం హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా కళాశాల విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ముందుగా ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం చక్రధరరెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడలో భాగస్వామ్యం కావాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీ ప్రసాద్, ఏఓ శ్రీనాథ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిమజ్జనం ప్రశాంతంగా పూర్తి చేయాలి


హంద్రీ- నీవా కాలువను పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

ఆత్మకూరు: గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా పూర్తయ్యేలా చూడాలని ఎస్పీ జగదీష్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం పంపనూరు వద్ద వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగే హంద్రీ – నీవా కాలువను పరిశీలించారు. అపశ్రుతులు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు చేపట్టాలని పోలీసులకు సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో వృద్ధులు, పిల్లలు లేకుండా చూడాలన్నారు. ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. బారికేడ్లు ఏర్పాటు చేసి గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. వాహనాలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు.

ఫైర్‌మెన్‌కు రూ.95 లక్షల బీమా పరిహారం


మృతి చెందిన ఫైర్‌మెన్ కుటుంబ సభ్యులకు చెక్కును అందిస్తున్న బ్యాంక్ ఆఫ్ బరోడా రీజినల్ మేనేజర్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి

అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లా అగ్నిమాపక శాఖలో పనిచేసిన ఫైర్‌మెన్ వై. సుధాకర్ కుటుంబానికి బ్యాంక్ ఆఫ్‌బరోడా డీజీఎం ఎస్కే ప్రసాద్, రీజినల్ మేనేజర్ పి. అమరనాథ రెడ్డి, సాయినగర్ బ్రాంచ్ మేనేజర్ టి.కిరణ్ కుమార్, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి వి. శ్రీనివాస రెడ్డి, అసోసియేషన్ సభ్యులు ఎం. చంద్రశేఖర్, బి. మనోహర్, సిబ్బంది సమక్షంలో శుక్రవారం చెక్కు అందించారు.సుధాకర్ విధి నిర్వహణలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. గతంలో అగ్నిమాపక శాఖ ఉద్యోగుల ప్రయోజనార్థం బ్యాంక్ ఆఫ్ బరోడాతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందులో భాగంగా సుధాకర్ బ్యాంకు ఖాతా బ్యాంక్ ఆఫ్ బరోడాలో ఉంది. ఈ సంఘటన నిమిత్తం బ్యాంక్ ఆఫ్ బరోడా వారు రూ.95 లక్షల బీమా క్లెయిమ్ చేశారు.

కాలం చెల్లిన మందులు పంపిణీ

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో కాలం చెల్లిన మందులు మింగి ఓ యువతి కళ్లు తిరిగి కిందపడిపోయినట్లు తెలిసింది. నగరానికి చెందిన ఓ యువతి మానసిక సమస్యతో ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని ఓపీ నంబర్ 18కు శుక్రవారం వెళ్లింది. కాగా వైద్యులు పలు రకాల మందులు రాశారు. కాగా మందులను తీసుకుని ఇంటికి వెళ్లిన ఆమె.. వాటిని వేసుకోగానే కాసేపటికి కళ్లు తిరిగి పడిపోయింది. వెంటనే కుటుంబీకులు నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా, అక్కడ వైద్యులు పరీక్షించి ఏ మందులు వాడారని ఆరా తీశారు. ఆ మందులు కాలం చెల్లినవిగా గుర్తించారు. ఇటీవల డ్రగ్ స్టోర్స్‌కు ఇన్‌చార్జ్‌గా డాక్టర్ మహ్మద్ గౌస్, సీఎంఓ డాక్టర్ కౌసర్ బేగం నియమితులయ్యారు. వీరు ఇలాంటి వాటిపై ఎందుకు దృష్టి సారించడం లేదో అర్థం కాలేదని పలువురు అంటున్నారు.

బైక్, మొబైల్ చోరీ

అనంతపురం: నగరంలోని టీవీ టవర్ సమీపాన అభినయ జూనియర్ కళాశాల వద్ద శుక్రవారం సాయి కిరణ్ అనే వ్యక్తి బైక్ నిలిపి, సమీపంలోని ముళ్లపొదల్లో మూత్రవిసర్జనకు వెళ్లాడు. ట్యాంకు కవర్లో మొబైల్ ఉంచాడు. తిరిగి వచ్చేలోపు మొబైల్‌తో సహా బైక్ చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

వ్యక్తిపై దాడి

అనంతపురం: ఇంటి వద్ద మద్యం తాగవద్దని చెప్పిన వ్యక్తిపై తాగుబోతులు దాడిచేశారు. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని నీరుగంటి వీధిలో నారాయణ్ సింగ్ నివాసం వద్ద శుక్రవారం కొందరు తాగుబోతులు మద్యం తాగుతున్నారు. దీన్ని గమనించిన నారాయణ్‌సింగ్ ఇక్కడ తాగరాదని తెలపగా.. ఆగ్రహించిన అనిల్, వెంకట్, శివ అనే యువకులు దాడి చేసి గాయపరిచారు. ఈ మేరకు బాధితుడు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

సంక్షిప్త సమాచారం

పీఏబీఆర్ కుడికాలువకు నీరు విడుదల చేయాలి

అనంతపురం సెంట్రల్: పీఏబీఆర్ కుడికాలువకు వెంటనే నీరు విడుదల చేయాలని జిల్లా పండ్లతోటల రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్‌ను నాయకులు అనంతరాముడు, మురళీమోహన్‌చౌదరి, రవీంద్రనాయుడు, రామాంజనేయులు, సంజీవరాయుడు, గోవిందనాయుడు, నారాయణ తదితరులు కలసి వినతిపత్రం అందజేశారు. వర్షాలతో జలాశయాలకు సమృద్ధిగా నీరు వచ్చినా జిల్లాలో చెరువులు మాత్రం పెద్దగా నిండలేదన్నారు. ఫలితంగా భూగర్భజలాలు ఆశించిన స్థాయిలో అభివృద్ధి కాలేదన్నారు. కాలువలు, చెరువులు ముళ్ల పొదలతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయని తెలిపారు.

శిక్షణ తరగతులు వాయిదా

అనంతపురం సిటీ: పంచాయతీ పురోగతి సూచిక 1.0 అంశంపై ఉమ్మడి జిల్లాలోని జెడ్పీటీసీ సభ్యులు, ఐసీడీఎస్ అధికారులు, డీడీఓలు, డీఎల్‌పీఓలు, ఇతర శాఖల అధికారులకు జెడ్పీలోని డీపీఆర్‌సీలో శుక్రవారం నిర్వహించాల్సిన శిక్షణ తరగతులు వాయిదా పడ్డాయి. ఈ మేరకు శిక్షణ కేంద్రం జిల్లా మేనేజర్ నిర్మల్ దాస్ తెలిపారు. కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ కారణంగా వాయిదా వేసినట్లు సమాచారం.

ఆర్డీని కలిసిన సచివాలయ ఉద్యోగులు

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని మున్సిపల్ ఆర్డీ కార్యాలయంలో ఆర్డీ నాగరాజును సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్డీకి పుష్పగుచ్ఛం అందించి, స్వాగతం పలికారు. వార్డు సచివాలయ ఉద్యోగుల సీనియార్టీ జాబితా ప్రకటించాలని ఆర్డీకి విన్నవించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు డీ సుధాకర్, వీ లక్ష్మినారాయణ, మల్లికార్జున, చంద్ర, వరప్రసాద్, శివశంకరయ్య, వినయ్, మంజునాథ్, మహేష్ నాయక్, మల్లన్న, రవికుమార్, రమేష్, ఆదినారాయణ, శ్రీనాథ్ పాల్గొన్నారు.

సీనియార్టీ జాబితా ప్రకటించండి

అనంతపురం సిటీ: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సీనియార్టీ జాబితా ప్రకటించాలని కోరుతూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ (రాయలసీమ ఆర్డీ) నాగరాజును ఆ శాఖ ఉద్యోగులు కోరారు. అనంతపురంలోని ఆర్డీ కార్యాలయంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆర్డీని వారు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమ సమస్యలను ఆయనకు వివరిస్తూ.. వినతిపత్రం అందించారు. దీనిపై ఆర్డీ సానుకూలంగా స్పందించారు. త్వరలోనే సీనియార్టీ జాబితా ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. ఆర్డీని కలిసిన వారిలో జేఏసీ ప్రతినిధులు సుధాకర్, లక్ష్మీనారాయణ, మల్లికార్జున, చంద్ర, వరప్రసాద్ ఉన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు సహకరించండి

ఆత్మకూరు: బాల్య వివాహాల నిర్మూలనకు సహకరించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ఈఓ బాబును కోరారు. ఈ మేరకు ఈఓకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ ఆలయ ఆవరణలో 18 సంవత్సరాల వయసు లోపలున్న పిల్లలు ఎవ్వరూ కూడా వ్యాపారం కానీ, భిక్షాటన కానీ చేయరాదని కోరారు. ఎవరైనా బాల్య వివాహాలు చేయడానికి ప్రయత్నిస్తే జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తల సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

సమైక్య తెలుగు రాజ్యం పార్టీకి కలెక్టర్ నోటీసు

అనంతపురం అర్బన్: భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 2019 నుంచి ఎన్నికల్లో ఎందుకు పోటీ చేయలేదో కారణాన్ని రాతపూర్వకంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి సమర్పించాలని 'సమైక్య తెలుగు రాజ్యం' పార్టీకి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.వినోద్‌కుమార్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. వివరాలను కలెక్టర్ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. సమైక్య తెలుగు రాజ్యం పార్టీ అధ్యక్షుడు లేదా కార్యదర్శి సెప్టెంబరు 8న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఎదుట విచారణకు హాజరవ్వాలన్నారు. లేని పక్షంలో నమోదైన రాజకీయ పార్టీల జాబితా నుంచి తొలగించనున్నట్లు నోటీసులో పేర్కొన్నారు.

ఉర్దూ స్కూళ్ల డీఐకి సన్మానం

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని ఉర్దూ స్కూల్స్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ (డీఐ)గా ఇటీవల నియమితులైన పి.దావూద్‌ను ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా దావూద్ మాట్లాడుతూ అందరి సహకారంతో ఉర్దూ భాషాభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని తెలియజేశారు. ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్ మాట్లాడుతూ ఉర్దూ పాఠశాలలకు తెలుగు ఎస్జీటీని కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కే సర్దార్ వలి, రాష్ట్ర కౌన్సిలర్ రమణ, నాయకులు నజీర్, సలీం, సోహెల్, మన్సూర్, బషీర్, ఫక్రుద్దీన్, బాబ్‌జాన్, రఫీక్, అబ్దుల్ రజాక్, ఇందాదుల్లా, కలీం పాల్గొన్నారు.

ఆకట్టుకున్న తోలు బొమ్మలాట

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం పాపంపేటలోని వినాయక మంటపం వద్ద శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం రూరల్ మండలం నిమ్మలకుంటకు చెందిన కళాకారులు శుక్రవారం రాత్రి తోలు బొమ్మలాట ప్రదర్శించారు. రామాయణంలో 'మై రావణ్ చరిత్ర' అనే సీనును తోలుబొమ్మలాట ద్వారా వివరించారు. శిండే శివరాము ఆధ్వర్యంలో షిండే బాలమ్మ, శంకరప్ప, చిన్న రమణ, వెంకటమ్మ, శివగంగ ప్రదర్శనలో పాల్గొన్నారు. రాత్రి 9 గంటలకు ప్రారంభమైన ప్రదర్శన అర్ధరాత్రి దాటే దాకా సాగింది. వృద్ధులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. నిర్వాహకులు 8వ వండర్ బ్యాచ్ సభ్యులకు తోలుబొమ్మలాట కళాకారులు కృతజ్ఞతలు తెలియజేశారు.